ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
బుధవారం 9 జూలై 2025



సర్కారు బడులకు ఆదరణ
● ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు
● గోయగాం ప్రీ ప్రైమరీ పాఠశాలలో 33 మంది ప్రవేశాలు 6

గమ్యం చేరని ప్రయాణం..
● ప్రమాదకరంగా లోలెవల్ కల్వర్టులు 7

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు

నస్పూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సుందరయ్య కాలనీలో మంగళవారం రేణుక ఎల్లమ్మ ఆషాఢ బోనాలను కాలనీ వాసులు ఘనంగా నిర్వ హించారు. వెంకటేశ్వర ఆలయం సమీపం నుంచి రేణుక ఎల్లమ్మ ఆలయం వరకు శివ సత్తుల పూనకాలు, విన్యాసాలు, నృత్యాలతో బోనాల ప్రదర్శన సాగింది. రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద తల్లికి ప్రత్యేక పూజల నిర్వ హించి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



నస్పూర్‌లోని సుందరయ్య కాలనీలో ఎల్లమ్మ బోనాల ప్రదర్శన

భారీ వాహనాలను అనుమతించండి

ఎంపీ నగేష్‌కు వినతిపత్రం ఇచ్చిన మండల నాయకులు

జన్నారం, జూలై8 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం గుండా వెళ్లేందుకు భారీ వాహనాలను అనుమతించాలని కోరుతూ మంగళవారం ఆదిలాబాద్ ఎంపీ గేడెం నగేశ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సామాజిక ఉద్యమ కారులు అటవీసంరక్షణ ఉద్యమ కారులు శ్రీరాముల భూమాచారి మాట్లాడుతూ టైగర్ జోన్‌ను ప్రకటించడంతో జన్నారం మండలం పూర్తిగా అభివృద్ధిలో కుంటుపడిందని అభివృద్ధికోసం భారీ వాహనాలను జన్నారంలో అనుమతించి, నాలుగు లైన్ల రోడ్లను నిర్మించాలని ఈ సమస్యపై పార్లమెంట్‌లో చర్చించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శ్రీనివాస్, షేక్ అక్బర్, బద్రీనాథ్, మహేశ్, మనీశ్‌లు పాల్గొన్నారు.



ఎంపీ నగేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యార్థి సంఘాల పేరుతో బెదిరింపులు

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ట్రస్మా సంఘం నాయకులు

మంచిర్యాలక్రైం/కలెక్టరేట్ జూలై8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘాల పేరుతో కొంత మంది పలు పాఠశాలలను బెదిరింపులకు గురి చేసి డబ్బులు ఇవ్వాలని పాఠశాల యాజమాన్యాలను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ట్రస్మా జిల్లా అధ్యక్షులు దామెర్ల సిద్ధయ్యతో పాటు పాఠశాల యజమానులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విద్యాశాఖ ఇచ్చిన గుర్తింపు ప్రకారమే పాఠశాలలు నడుపుతున్నామని కానీ కొంత మంది ఎలాంటి గుర్తింపు లేకుండా విద్యార్థి సంఘం నాయకులమని చెప్పుకుం టూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను బెదిరిస్తున్నారన్నారు. విద్యా శాఖ అధికారులు సంఘంలోని కొన్ని పాఠశాలలకు ఆర్టీఐ యాక్ట్ కింద నోటీసులు ఇస్తున్నారని ప్రైవేటు పాఠశాలలకు ఆర్టీఐ యాక్ట్ వర్తించదని చెప్పినా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సుమారు 60మంది ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం కలెక్టర్‌తో పాటు రామగుండం కమిషనరేట్‌కు వినతిపత్రం అందజేశారు. ట్రస్మా నాయకులు ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కోశాధికారి ఉదారి చంద్రమోహన్‌గౌడ్, రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రావు, కస్తూరి పద్మచరణ్, సురభి శరత్ కుమార్, అఖిలేందర్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

లక్సెట్టిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉచిత వైద్యం, విద్య అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. లక్సెట్టిపేటలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనం పనులను ఆయన మంగళవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈనెల 13న భవనం ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి భవనం ప్రారంభోత్సవానికి ఆరోగ్యశాఖ మంత్రి రాజనరసింహ, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పలు వసతిగృహాలు పరిశీలించి విద్యార్థులతో కలిసి మంత్రులు మధ్యాహ్న భోజనం చేస్తారన్నారు.

ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట గిరిజన అభివృద్ధి సంక్షేమ శాఖ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ కోటేశ్వర్, డాక్టర్ ఆకుల శ్రీనివాస్, వైద్యులు సురేష్, కృష్ణ, స్రవంతి, పవిత్ర, తహసీల్దార్ దిలీప్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, ట్రాన్స్‌పోర్టు మెంబర్ అంకతి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ పాల్గొన్నారు.

సాదాబైనామాలపైనే ఆశలు

2016 నుంచి క్రమబద్ధీకరణకు నోచుకోని వైనం

● అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి రైతుల ఎదురుచూపులు
● రెవెన్యూ సదస్సులో పెద్ద మొత్తంలో దరఖాస్తులు
● ధరణిలో పరిష్కారం కాని భూ సమస్యలు



మంచిర్యాల, జూలై8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన 'ధరణి' భూ సమస్యలకు పరిష్కారం చూపకపోగా అనేక చిక్కు ముడులను తెచ్చిపెట్టింది. అర్జీల పరిష్కారం కోసం రైతులు కాళ్లరిగేలా తిరిగిన స్పందనలేకుండా పోయింది. ఈ క్రమంలో కాంగ్రెస్ హయాంలో 'ధరణి' స్థానంలో తెరపైకి వచ్చిన 'భూభారతి' రైతుల్లో ఆశ లను రేకెత్తిస్తోంది. భూభారతి కింద రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను సైతం ఆహ్వానించింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో పెద్ద మొత్తంలో దరఖాస్తులు వచ్చాయి. స్వీకరించిన దరఖాస్తుల్లో అధికభాగం సాదాబైనామా, అసైన్డ్ భూములకు సంబంధించివి కావడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా సాదాబైనామా పరిష్కారంకోసం 2,866 దరఖాస్తులు రావడం కొసమెరుపు. వచ్చిన దరఖాస్తులను బట్టి చూస్తే సాదాబై నామాల చట్ట బద్దత, సమస్య ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'భూబారతి'లోనైన తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందేమోనని బాధిత రైతులు ఆశతో ఉన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో 2020 అక్టోబర్‌లో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ అప్పుడు పరిష్కారం లభించలేదు. కనీసం ప్రస్తుత ప్రభుత్వమైన పరిష్కారం చూపుతుందనే ఆశతో రైతులు ఉన్నారు.

భూభారతితో పరిష్కారం...!

ప్రభుత్వం ఆర్‌వోఆర్-2020-25 భూభారతి చట్టాన్ని తీసుకవచ్చింది. ఇందులో భాగంగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయగా బాధితులు దరఖాస్తులు చేసుకున్నారు. గత ప్రభుత్వం రైతులకు భూ హక్కులు కల్పించే పట్టదారు పాసు పుస్తకాల చట్టం-1971ని రద్దు చేసి కొత్తగా పాసు పుస్తకాలచట్టం -2020 పేరిట ధరణిని తీసుకొచ్చింది. అయితే ఈ విధానం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా కొత్త సమస్యలను తీసుకొచ్చింది. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కార్ గత ఏప్రిల్ 14న ధరణి స్థానంలో కొత్తగా భూభారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా జూన్ 3వతేదీ నుంచి అన్ని మండలాల్లో ప్రభుత్వం రెవెన్యూసదస్సులు నిర్వహించి 20వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించింది. ఆగస్టు 15వ తేదీ వరకు సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. దీంతో భూ సమస్యలకు భూభారతిలో పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం రైతుల్లో కనిపిస్తోంది.

జీవోల జారీతోనే సరిపెట్టిన గత ప్రభుత్వం...

రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో సాదా బైనామా కూడ ఒకటి. గతంలో గ్రామాల్లో చాలా మంది రైతులు రెవెన్యూ స్టాంప్ పేపర్లు తెల్లకాగితాలపై భూముల క్రయవిక్రయాలు జరిపేవారు. భూముల హక్కు సంపూర్ణంగా లభించేది కాదు. ఈ విషయమై దృష్టి సారించిన గత ప్రభుత్వం సాదాబైనామాల సమస్యను పరిష్కరించేందుకు 2016లో జీవో నెంబర్ 153ను తీసుకొచ్చింది. జూన్ 2014 2వతేదీకి ముందుగా సాదాబైనామాలతో భూములు కొను గోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించారు. 2020 అక్టోబర్ 12న కూడ జీవో నెంబర్ 112ను జారీ చేసింది. సాదాబైనామాల...

(తరువాయి 7లో..)

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి

మంచిర్యాలక్రైం, జూలై8 (ఆంధ్రజ్యోతి): తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుపనులను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ జల సాధన కమిటీ కన్వీనర్ నైనాల గోవర్ధన్, ప్రముఖ న్యాయవాది కొండేటి సత్యనారాయణ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. కేసీఆర్ రీడి జైన్, రీ ఇంజనీరింగ్ పేరిట కాళే శ్వరం(మేడిగడ్డ అన్నారం) సుందిళ్ల అనే బ్యారేజీలను నిర్మించారని, అవి భారీ లీకేజీలు ఏర్పడి పనికి రాకుండా పోయాయన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం యుద్ధ ప్రాతి పదికన తుమ్మిడిహెట్టి ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించి వినియోగంలోకి తీసుకరావాలన్నారు. కాళేశ్వరం బ్యారే జీల విపత్తుకు మేడిగడ్డ కుంగిపోవడానికి దారితీసిన పరిస్థితులపై ప్రజా భవన్‌లో నేడు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి తుమ్మిడి హెట్టి నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బెల్లంపల్లి, జూలై8 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ తడక రవి కుమారుడు దినేష్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మంగళవారం పరామర్శించాడు. దినేష్ మృతికిగల కారణాలను కుటుంబ సభ్యులను అడిగితెలుసుకున్నారు. దినేష్ అకాలమరణం తనను కలిచివేసిందని మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎలాంటి అవసరం ఉన్న తోడుగా ఉంటానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, నాయకులు సత్యనారాయణ, బడికెల శ్రావన్, కమల, దాసరి శ్రీనివాస్, రమేశ్‌లు పాల్గొన్నారు.

పట్టణ పరిధిలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలి

చెన్నూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణ పరిధిలోని గోదావరి వద్ద ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలో ఇసుకరీచ్ ఏర్పాటు చేయాలని గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న ట్రాక్టర్ యాజమానులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి చెన్నూరు ప్రజలు ఇసుక కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెన్నూరు పట్టణానికి తలాపున గోదావరి ఉన్నా ఇల్లు కట్టుకోవడానికి తట్టెడు ఇసుక దొరకడం లేదన్నారు. గోదావరి ఇసుక కావాలంటే దళారులను ఆశ్రయించి రూ.4వేలు చెల్లించి ట్రాక్టర్ ఇసుక కొంటున్నారన్నారు. దీనివల్ల కొంత మంది దళారులు లాభ పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే రాష్ట్ర గనులశాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి స్పందించి టీస్ ఎండీసీ ద్వారా ఇసుకరీచ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న బతుకమ్మ వాగు ఇసుక రీచ్‌లో నాణ్యతలేని ఇసుక వల్ల భవనాలకు క్రాక్‌లు వస్తున్నాయని, దీంతో ఇండ్లు కట్టుకున్నవారు నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, కౌన్సిల్ సభ్యుడు బత్తుల సమ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్, నాయకులు చారి, రాజేశ్వర్, రాజయ్య, రాజశేఖర్‌గౌడ్, మధుకర్, శ్రీనివాస్, నరేష్, జనార్ధన్, రమేష్, గణేష్‌సింగ్ పాల్గొన్నారు.



ట్రాక్టర్ యజమానులకు సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

సమస్యల పరిష్కారానికే మార్నింగ్ వాక్



ప్రజా సమస్యలు అడిగితెలుసుకుంటున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

జన్నారం, జూలై8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే మార్నింగ్‌వాక్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటూ అప్పటికప్పుడే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని పొన్కల్‌గ్రామంలో మార్నింగ్‌వాక్ కార్యక్రమాన్ని (పొద్దుపొడుపు బొజ్జన అడుగు) కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా గ్రామంలో డ్రైనేజీల సమస్య, సీసీరోడ్ల నిర్మాణం, తాగునీరు సమస్యతో పాటు ప్రజలకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు వినడంతో పాటు వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వారికి అర్థమయ్యే విధంగా వివరించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లురాని వారికి రాలేదన్న కొంత మంది ఫిర్యాదుల మేరకు వారికి రెండోవిడతలో ఇచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమపథకాలను శ్రీకారంచుట్టి ఆచరణలో పెడుతుందన్నారు. తన ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సమస్యలు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. వారివెంట మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు ముజాఫర్ అలీ, సయ్యద్ ఫసియుల్లా, మోహ న్‌రెడ్డి, ఇసాక్, నందు నాయక్, ఇందయ్య, రమేశ్, సుధీర్, గంగన్న యాదవ్‌తో పాటు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి సంబరాలు

కోటపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఇందిరా మహిళ శక్తి సంబరాలను నిర్వహించారు. ప్రభుత్వం మహిళల కొరకు చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సంవత్సరం మండల సమాఖ్య సాధించిన బ్యాంకు లింకేజీ, బ్యాంకు యార్డ్ ఫౌల్ట్రీ, ఫౌల్ట్రీ మదర్ యూనిట్, న్యూ ఎంటర్‌ప్రైజెస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వంటి పలురకాల పనులను సాధించిన ప్రగతినివేదికను గ్రామసంఘాల ద్వారా చదివి వినిపించారు. అలాగే మండలంలోని పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు కుట్టిన లావణ్య సంఘం సభ్యురాళ్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీలు సుధాకర్, రాజేశ్వరి, సునీత, రుబీన, ఎంఎస్‌ఏ సంపత్, ఎంఎస్‌సీవో శివకృష్ణ స్వామి, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



వైఎస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, జూలై8 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగ ర్ రావు అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో వైఎస్సార్ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనకు ఎంతో సన్నిహితులన్నారు. బడుగ బలహీనవర్గాల ప్రజల కు సేవలందించి ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, నాయకు లు బొలిశెట్టి కిషన్ పాల్గొన్నారు.

చెన్నూరు : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ము ఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం చెన్నూరు పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయన రాష్ట్రానికి, కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు హేమంతరెడ్డి, నాగరాజు, అంకాగౌడ్, శ్రీధర్, సత్యనారాయణ, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జర్మనీ ప్రతినిధులు

చెన్నూరు/మందమర్రిటౌన్ జూలై 8 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌విన్ ప్రాజెక్టుపై నర్సింగ్ నియామకాలకోసం జర్మనీ దేశానికి చెందిన ప్రతినిధులు మంగళవారం హైద్రాబాద్‌లో కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిశారు. తెలంగాణలో నర్సింగ్‌చేసిన వారికి ఉద్యోగా వకాశాలు కల్పిస్తామని, జర్మనీ భాషను ఉచితంగా నేర్పిస్తామని బృం దం ప్రతినిధులు పేర్కొన్నారు. జర్మనీ భాష శిక్షణతో పాటు ఆఫ్టర్‌వర్క్ చేసిన వారు జర్మనీలోని ప్రఖ్యాత ఆరోగ్య సంస్థల్లో నియమితులవుతారని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఈనెల 9నుంచి 17వతేదీ వరకు బేగంపేట పర్యాటక భవన్‌లో తెలంగాణలోని నర్సులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం టామ్‌కామ్ సంస్థ ద్వారా తెలంగాణ రాష్ట్ర యువతకు విదేశాల్లో ఉద్యో గాలు సమకూర్చడానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జర్మని ప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రి వివేక్‌వెంకటస్వామితో జర్మనీ దేశ ప్రతినిధులు

మొక్కలు నాటి సంరక్షించాలి



మోడల్ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

కోటపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో లక్ష్మయ్య, తహసీల్దార్ రాఘవేంద్రరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అక్తర్ మొహియొద్దీన్, పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, ఏపీవో వెంకటేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సందీప్, ఉపాధి హామీ టీఏలు సరిత, సంపత్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భీమారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాజీపల్లి గ్రామానికి చెందిన జేగటి రామచందర్ (51) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు భీమారం ఎస్ఐ తెలిపారు. రామచందర్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఈ నెల 6న రాత్రి గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు మంచి ర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తలరించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నమ్మించి మోసం చేశాడంటూ యువతి బైఠాయింపు

చెన్నూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కుడికాల మధు అనే వ్యక్తి తనను ప్రేమించి మోసం చేశాడంటూ స్థానిక కోట బొగుడకు చెందిన సౌమ్య అనే యువతి మంగళవారం మధు ఇంట్లో బైఠాయించింది.. బాధితురాలి కథనం ప్రకారం 2016లో సౌమ్య, మధు కలిసి కొంత కాలం హైద్రాబాద్‌లో సహజీవనం చేశారు. కొంత కాలం తర్వాత సౌమ్యను మోసం చేసి మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో సౌమ్య మధుకు దూరం అయింది. ఇటీవల మధు సౌమ్య వద్దకు వచ్చి పెళ్లి చేసుకుంటానంటూ ఆమెను నమ్మించి గర్భవతిని చేశాడు. కొద్ది రోజుల క్రితం సౌమ్యకు అబార్షన్ చేయించాడు. తనతో ఉండాలని సౌమ్య కోరినా వినకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో తనకు న్యాయం చేయాలని తనతోనే జీవితం గడపాలని బాధితురాలు మంగళవారం మధు ఇంట్లో బైఠాయించింది. దీంతో మధు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి ఆమెను అక్కడ నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహిళకు పలు మహిళ సంఘాలు మద్దతు తెలిపాయి. బాధితురాలుకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపు తున్నట్లు సీఐ దేవేందర్‌రావు తెలిపారు.

పులిదాడిలో లేగదూడ మృతి

- భయాందోళనలో అటవీ సమీప ప్రాంత ప్రజలు



మృతి చెందిన లేగదూడను పరిశీలిస్తున్న అధికారులు

కాసిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పులులు, చిరుతపులులు ఆవుల మందలపై దాడి చేసి లేగదూడలను హతమార్చడం పశువుల కాపరులు యజమానులను ఆందోళనకు గురి చేస్తోంది. గత బుధవారం దేవాపూర్ అటవీరేంజ్ పరిధిలోని కొత్తగడ్‌పూర్‌లో చిరుత ఆవుల మందపై దాడి చేసి లేగదూడను హతమార్చింది. ఈ ఘటన మరువకముందే సోమవారం సాయంత్రం బెల్లంపల్లి అటవీ రేంజ్ ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని వెంకటాపూర్ 522 కంపార్ట్‌మెంట్‌లో పెద్దపులి ఆవుల మందపై దాడి చేసి లేగదూడను హతమార్చింది. దీనిపై బెల్లంపల్లి అటవీక్షేత్ర అధికారి పూర్ణచందర్ మాట్లాడుతూ వెంకటాపూర్‌కు చెందిన బుద్దే రాజలింగు లేగదూడ సోమవారం సాయంత్రం ఇంటికి రాకపోవడంతో మంగళవారం అటవీ శివారు ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. వెంకటాపూర్ అటవీశివారులో లేగదూడ చనిపోయి ఉండడాన్ని వారు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారన్నారు. అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించగా పెద్దపులి దాడి చేసిన ఆనవాళ్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. అడవిలో పెద్దపులి వెంకటాపూర్, మల్కాపల్లి, లక్ష్మీపూర్, సోనాపూర్, పెద్దగూడ అటవీశివారు ప్రాంతాల్లో పెద్దపల్లి సంచరిస్తుందని, కాబట్టి వ్యవసాయ కూలీలు, రైతులు పశువుల కాపరులు ఎవరు కూడ అడవిలోపలికి వెళ్లకూడదన్నారు. పెద్దపులి కదలికలను పశిగట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పులికి ఎవరైన హాని తలపెడితే వన్య ప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. లేగదూడ మృతదేహానికి పంచనామ నిర్వహించడం జరిగింది. లేగదూడ విలువ నుబట్టి బాధిత రైతుకు నష్టపరిహారం అందజేస్తామని ఆయన రైతుకు భరోసా కల్పించారు.

సర్కారు బడులకు ఆదరణ



గోయగాం ప్రీప్రైమరీ షాఠశాలలో చేరిన విద్యార్థులు

- ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు
- గోయగాం ప్రీ ప్రైమరీ పాఠశాలలో 33 మంది ప్రవేశాలు

కెరమెరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి. బడుల్లో మౌలిక వసతులు కల్పన, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయడంతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు సకాలంలో ప్రభుత్వం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది.

దీంతో సర్కారు బడుల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయి. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నిర్వహించిన బడిబాట కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రుల వైఖరిలో మార్పును తెచ్చినట్లు కనిపిస్తోంది. బడిబాట కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగస్వాములు కావడంతో మంచి స్పందన లభించింది. ఈ మేరకు మండలంలోని గోయగాం ప్రాథమిక పాఠశాలలో విద్యా సంఖ్య పెరిగింది. గతేడాది వరకు 33 మంది విద్యార్థులు ఉండగా ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులు చేసిన కృషి ఫలించింది. నెల రోజుల్లోనే మరో 33 మంది చిన్నారులు పాఠశాలలో ప్రవేశం పొందారు. దీంతో ప్రస్తుతం పాఠశాలలో 75 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మండలంలోని 85 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 342 మంది ఈ ఏడాది అడ్మిషన్ తీసుకున్నారు. వారిలో 76 మంది ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నారు.

ప్రీప్రైమరీ ప్రారంభంతో..

గోయగాంలో ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రీప్రైమరీ పాఠశాల ప్రారంభించారు. దీంతో ప్రైవేటు పాఠశాల నుంచి సర్కారు బడిలో 33 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. ఇతర తరగతుల్లోనూ సంఖ్య పెరగడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులతో పాటు కొంత మంది యువకులు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. పాఠశాల అభివృద్ధి దాతలు సైతం ప్రోత్సాహం అందిస్తున్నారు. ఎంఈవో ప్రకాష్ ఐదు వేలు, సావర్‌ఖేడ హెచ్ఎం ఐదు వేలు, గోయగాం హెచ్ఎం రవిజేత 24 వేల రూపాయలు అందజేశారు. గ్రామస్థుడు సుధాకర్ చిన్నారులకు బ్యాగులు, విజయ్ గుర్తింపు కార్డులు అందించగా, సునీల్ అనే వ్యక్తి ప్రతి నెలా 50 కిలోల బియ్యం అందజేస్తామని హామీ ఇచ్చారు. బడిబాటలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవితేజతో పాటు ఉపాధ్యాయులు, యువకులు గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి తిరిగి విద్యార్థుల వివరాలు సేకరించారు. తన సొంత ఖర్చులతో కర పత్రాలు ముద్రించి ప్రచారం నిర్వహించారు. ఆగస్టు నెలాఖరు వరకు ప్రవేశాలకు సమయం ఇవ్వడంతో మరింత మంది పెరిగే అవకాశం ఉంది.

విద్యార్థుల సంఖ్య పెరగాలి: ఆడె ప్రకాష్, ఎంఈవో



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగాలి. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందించేందుకు కార్యాచరణ రూపొందించాం. ప్రైవేటు పాఠశాలల నుంచి అత్యధిక మంది విద్యార్థులను చేర్చుకోవాలని ఆదేశాలిచ్చాం. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు ఉంటే ప్రీప్రైమరీ ప్రారంభిస్తాం.

ప్రీప్రైమరీ ప్రారంభించాలనుకున్నాం..: రవితేజ, ప్రధానోపాధ్యాయుడు



గతేడాది నుంచే ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులతో ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభించాలనుకున్నాం. బడిబాటలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తున్నాం. గ్రామస్థులు, యువకులు ఎంతో చేయూతనిస్తున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో మెరుగైన విద్య అందిస్తాం.

గడ్డి మందు పట్టివేత

వాంకిడి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గడ్డి మందును సోమవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... వాంకిడి పోలీసు స్టేషన్ శివారులో ఏఎస్సై పోశెట్టి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపడుతున్నామని చెప్పారు. ఆ సమయంలో మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ వైపు అనుమానాస్పదంగా వెళ్తున్న మంచిర్యాల జిల్లా భీమిని మండలానికి చెందిన ఇందూరి అశోక్, ఇందూరి చంద్రశేఖర్‌ల బైక్‌ను తనిఖీ చేయగా వారి వద్ద ప్రభుత్వ నిషేధిత 40 లీటర్ల గడ్డి మందు లభిం చినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి గడ్డి మందును స్వాధీనం చేసుకుని ఏఈవో అరుణ్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన గడ్డి మందును తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీని వల్ల పర్యావరణానికి ముప్పు ఉంటుందని పరిశోధనల్లో తేలిందని చెప్పారు. దీన్ని తరలించినా, కొనుగోలు చేసినా చర్యలు ఉంటాయని ఏఎస్సై పోశెట్టి తెలిపారు.

చింతలమానేపల్లి (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలం గూడెం చెక్ పోస్ట వద్ద తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద నిషేధిత గడ్డి మందు పట్టుబడిందని పోలీసులు తెలిపారు. బాబాసాగర్ గ్రామానికి చెందిన కోట శంకర్ అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్లు, కర్జెల్లి శివారులో కాగజ్‌నగర్ మండలం సార్సాలకు చెందిన పూసాల కృష్ణ వద్ద 30 లీటర్ల నిషేధిత గ్లైపోసెట్ గడ్డి మందును పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్, డీఎస్పీ రామానుజన్ ఆదేశాల మేరకు కౌటాల సీఐ రమేష్ పర్యవేక్షణలో తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అటవీ శాఖాధికారి సువాంత్ బోబడే

ఆసిఫాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరా సౌర గిరిజన జల వికాసం పథకం అమలుకు మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమగ్ర గిరిజనాభివృద్ధి పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ డివిజనల్ అటవీ శాఖాధికారి సువాంత్ బోబడేలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల కోసం ఆర్ఓఎఫ్ఆర్ పోడు పట్టాలు కలిగిన అర్హత గల రైతులకు ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈ పథకం కింద మొదటి విడతలో అర్హులైన పోడు పట్టా భూములలో సాగు నీరు అందించడం కోసం బోర్లు, వ్యవసాయ బావులను మంజూరు చేసి సౌర విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండున్నర ఎకరాలు కలిగిన అర్హులైన రైతులకు బోరు సౌకర్యం, రెండున్నర ఎకరాల లోపు ఉన్న రైతులు ఉంటే ఇద్దరు రైతులు కలిపి బోర్లు, బావిని నిర్మించే అవకాశం ఉందని తెలిపారు. మొత్తం ఐదు విడుతలుగా కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అటవీ శాఖ నుంచి అడ్డంకులు ఉండవని ఈ పథకం అమలుకు మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి నివేదికలు అందించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, డీఆర్‌డీఓ దత్తారావు, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఉద్యానవనాధికారి నదీం, మిషన్ భగీరథ ఈఈ సిద్దక్, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. స్థానికంగా మంగళవారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వరద పరిస్థితులను ప్రజలకు ముందస్తుగా తెలియజేసి సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ దిశగా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందన్నారు. ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో కంట్రోల్ రూం 8500844365 నంబరును ఏర్పాటు చేశామని అన్నారు. సహాయం, ఇతర సౌకర్యాల కోసం ప్రజలు సంప్రదించవచ్చని. 24 గటలు అందుబాటులో ఉంటామని చెప్పారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ద్వారా ఐదు లక్షల రూపాయల వ్యయంతో సమకూర్చిన నాలుగు సీట్లతో కూడిన బోటు, 50 లైఫ్ జాకెట్లు, 20 రబ్బర్ ట్యూబులు, ఒక కోత యంత్రంలను జిల్లా ఎస్పీ సుభాష్ కాంతిలాల్, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్‌లతో కలిసి పరిశీలించి అగ్నిమాపక శాఖకు అందజేశారు.

యూరియా కోసం రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

జైనూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు సరిపడా యూరియా అందజేయాలని మండలంలోని వివిధ గ్రామాల రైతులు మంగళవారం మండల కేంద్రంలోని ప్రధానరోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. పలువురు రైతులు మాట్లాడుతూ మం డల కేంద్రంలో నాలుగు ప్రభుత్వ దుకాణాలు ఉన్నప్పటికీ యూరి యా దొరకడం లేదన్నారు. సహకార కేంద్రానికి వచ్చిన యూరి యా బస్తాలు కేవలం గంటలోనే అయిపోతున్నాయని చెప్పారు. అధికారులు సరిపడా యూరియా తెప్పించి అందజేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులతో మాట్లాడి యూరి యా వచ్చేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. రాస్తారోకోలో పట్నాపూర్, పవర్‌గూడ, జంగాం, పొలాస, ఉషేగాం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జైనూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం అక్రమంగా ఇసుక తరిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రవికుమార్ మాట్లాడుతూ మంగళవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా మూ డు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణ చేస్తుండడంతో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

శ్రీరాంపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న నాలుగు లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. ఎస్ఆర్‌పీ 1, ఏరియా వర్క్‌షాప్, శ్రీరాంపూర్ ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు, ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, గరిగె స్వామి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, చంద్రశే ఖర్, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేష్, పానుగంటి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో విద్యార్థులు పాల్గొనాలి

దేశవ్యాప్త సమ్మెలో విద్యార్థులు, యువకులు పాల్గొనాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి శ్రీకాంత్ కోరారు. శ్రీరాంపూర్ ఐటీఐలో మాట్లాడారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్, నాయకుడు కార్తీక్, విద్యార్థులు విష్ణుప్రియ, రాజేష్, తిరుపతి పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

కాసిపేట ,జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ బుధవారం చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి జేఏసీ సంఘాల నాయకులు కోరారు. కాసిపేట 2గనిపై ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి ఎండీ అక్బర్‌అలీ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మణిరాంసింగ్, టీజీఎల్‌బీకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు చాంద్‌పాషా, ఎస్‌జీకెఎస్ రాష్ట్ర కన్వీనర్ అంబాల మహేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో మల్లేష్, ర వీందర్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి సాధించాలి



ఓసీపీని పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు

శ్రీరాంపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ఉద్యోగులు కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు అన్నారు. ఆర్కే 7, ఆర్కే న్యూటెక్, శ్రీరాంపూర్ ఉపరితల గనులను మంగళవారం ఆయన సందర్శించారు. పని స్థలాలను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, నిర్దేశిత బొగ్గు లక్ష్యాల సాధనకు తగిన ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం ఎం. శ్రీనివాస్, ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏజెంట్లు, మేనేజర్లు, రక్షణాధి కారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బెల్లంపల్లి రీజియన్ అధికారులతో సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల జీఎంలు ఎం. శ్రీనివాస్, దేవేందర్, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సన్మానం

శ్రీరాంపూర్ ఏరియాకు మొదటిసారి వచ్చిన సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రును ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి సుధాకర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శి సందీప్, తదితరులు పాల్గొన్నారు. కాగా ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు ఆధ్వర్యంలో సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రును కలిసి పూలబొకే, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కేంద్ర నాయకులు గరిగె స్వామి, ఏనుగు రవీందర్ రెడ్డి, తిరుపతి రాజు, చాట్ల అశోక్, ఏరియా కార్యదర్శి బి. ప్రసాద్, యువజన విభాగం కన్వీనర్ ప్రవీణ్, రౌతు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, అన్వేష్‌రెడ్డి, గడ్డం మహిపాల్ రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులు సమ్మెకు దూరంగా ఉండాలి

రెబ్బెన, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సింగరేణి ఉద్యోగులు ఉండాలని బెల్లంపల్లి జీఎం విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఖైరిగూడ వద్ద మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నెలకొన్న పోటీ ప్రపంచంలో ఒక్క రోజు పని గంటలు నష్టపోవటం వల్ల మన కంపెనీ వెనుకంజ వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పలు రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్న మన కంపెనీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఒక్క రోజు సమ్మతో బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడి పోతామని చెప్పారు. కార్మికులు సంస్థ పురోగతిని పట్టించుకోవాలని, సమ్మెపై పునరాలోచించాలని కోరారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్, ఇంజనీర్ వీరన్నపాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనవద్దని, విధులకు హాజరు కావాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్లు, డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారు అన్ని ఏరియాల జీఎంలతో మాట్లాడారు. సమ్మె డిమాండ్లలో సింగరేణి కార్మికులకు చెందినవి లేవని, యాజమాన్యం పరిష్కరించాల్సిన కావని చెప్పారు. సమ్మెతో సింగరేణి సంస్థ, కార్మికులు కోట్ల రూపాయలు నష్టపోతారని తెలుసుకోవాలన్నారు. ఇప్పటికే అందిస్తున్న లాభాల బోనస్, పీఎల్ఆర్ బోనస్, వివిధ సంక్షేమ పథకాలు అందించడానికి ఇబ్బందులు కలుగుతాయన్నారు. 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికిగాను ఈ నెల 1వ తేదీ వరకు కేవలం 22.4 శాతం మాత్రమే సాధించామన్నారు. ఈ విషయాన్ని ఉద్యోగులు దృష్టిలో పెట్టుకొని సహకరించాలని కోరారు. సమావేశంలో జీఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం కవితానాయడు, జీఎం(సెక్యూరిటీ) లక్ష్మీనారాయణ, అన్ని ఏరియాల జీఎంలు, డీజీ ఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి సహకరించాలి

మందమర్రిటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా బుధవారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సింగరేణి ఉద్యోగులు దూరంగా ఉండాలని, సంస్థ అభివృద్ధికి సహకరించాలని సింగరేణి డైరెక్టర్ పా గౌతమ్ పొట్రు, సింగరేణి డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సమ్మెతో సింగరేణికి ఎలాంటి సంబంధం లేదని కార్మికులు గ్రహించాలన్నారు. సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన డిమాండ్లు ఏమిలేవని చెప్పారు. సమస్యలుంటే చర్చల ద్వారా పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. సమ్మె వల్ల నష్టపోతామని తెలిపారు. కార్మికులందరూ దీన్ని గమనిచి విధులకు హాజరు కావాలని కోరారు.



సింగరేణిలో సార్వత్రిక సమ్మె



కేకే 5 గనిపై మాట్లాడుతున్న కార్మిక జేఏసీ నాయకులు

మందమర్రిటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా సింగరేణిలో బుధవారం సార్వత్రిక సమ్మె చేపడుతున్నామని కార్మిక జేఏసీ నాయకులు, ఎస్ సత్యనారాయణ, ఎస్ వెంకటస్వామి, రాంశెట్టి నరేందర్, జె రవీందర్, గాండ్ల సంపత్ అన్నారు. ఏరియాలోని కేకే5 గనిపై మంగళవారం నిర్వహించిన సమ్మె సన్నహాక గేటు మీటిం గ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని ప్రజల ప్రయోజనా లను విస్మరించి పెట్టుబడిదారుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. బొగ్గు పరిశ్రమలన్నింటినీ కారు చౌకగా అదాని, అంబానీలకు అప్పగించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించా రు. సమ్మెను నివారించడానికి యాజమాన్యం తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఉద్యోగులు ఉంటేనే అధికారులు ఉంటారని వాస్తవాన్ని గ్రహించాలని కోరారు.

సమ్మె నివారణపై యాజమాన్యం ఫోకస్

మందమర్రిటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సమ్మె నివారణకు సంబంధించి యాజమాన్యం ఫోకస్ పెట్టింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేడు తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఇందుకు యాజమాన్యం కూడా సమ్మెలో పాల్గొనవద్దని, దేశ వ్యాప్త సమ్మెకు సింగరేణికి సంబంధం లేదని కార్మికులు విధులకు హాజరు కావాలని సూచించింది. కార్మికులు సమ్మెకు దూరంగా ఉండాలని మంగళవారం యాజమాన్యం వీడియో విడుదల చేసింది. విధులకు హాజరు కావాలని సూచించింది.

సంక్షిప్త సమాచారం

తాండూర్ : గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కిష్టంపేట గ్రామంలో పర్యటించారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుద్య పనులను పరిశీలించారు. ఇంటింటికి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలని, గ్రామంలో ఎక్కడ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌రామ్ ప్రసాద్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నెన్నెల : బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పూలమాలలు, శాలువాలతో ఘణంగా సన్మానించారు.

కాసిపేట: మండలంలోని వెంకటాపూర్ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, పెన్నులను స్వచ్ఛంద సంస్థ ద్వారా అందజేశారు. గిరిజన ప్రాంతంలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు పెన్నులతో పాటు బ్యాగులు అందజేశారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని కోరగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు నెలలు గా అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండగా మందమర్రికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేటూరి సత్యనారాయణ ఆరోగ్యం కోలుకుంటే 101 కొబ్బరి కాయలు కొడుతానని మొక్కు కున్నారు దీనితో ఆమొక్కును తీర్చుకున్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని పాడి రైతులు పశువులను ఇండ్ల వద్దే కట్టేయాలని పట్టణ ఎస్‌ఐ రాజశేఖర్ అన్నారు. మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా పాడి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఆవులు, గేదెలు రోడ్లమీదకు రాత్రి, పగలు రోడ్ల మీదకు చేరి వాహనదారులకు, పాదచారులకు పరుగెత్తుకు రావడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని ఇంటి వద్దనే ఉంచాలని కోరారు.

భీమారం : రోడ్లపైకి పశువులను వదిలితే వాటి యాజమానులపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని భీమారం ఎస్‌ఐ శ్వేత పేర్కొన్నారు. మంగళవారం ఆటో మైక్ ద్వారా భీమారంలో ప్రచారం నిర్వహించారు.

మందమర్రిరూరల్ : మహిళ సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం లలితకుమారి పేర్కొన్నారు. మంగళవారం ఇందిరా మహిళ శక్తి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని, తీసుకున్న రుణాలతో వ్యాపారాలు చేసి అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు చారి, మోహన్, సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి : దేవులవాడ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలిక సాధికారతపై అవగాహన కల్పించారు. బాలల రక్షణ, చైల్డ్ హెల్ప్‌లైన్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ఆర్థిక నేరాలపై అవగాహన కల్పించారు.



లోత్రాై నుంచి బైక్‌ను దాటిస్తున్న ప్రయాణికులు (ఫైల్)



నక్కలపల్లి దారిలో కాజ్‌వే పై నుంచి ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

గమ్యం చేరని ప్రయాణం..

- ప్రమాదకరంగా లోలెవల్ కల్వర్టులు
- వర్షాలు పడితే స్తంభిస్తున్న జన జీవనం



పారుపెల్లి దారిలో అక్కెపల్లి వాగు కాజ్‌వే దుస్థితి

కోటపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామాల ప్రజలు వణికిపోతారు. ఇంటి నుంచి బయటకు వెళితే మళ్లీ ఇంటికి వస్తామో రామో అనే ఆందోళన నెలకొంటోంది. లో లెవెల్ కల్వర్టులు, రోడ్ డ్యాంల నిర్మాణాలను ఏండ్ల కాలం చేపట్టకపోవడంతో వానాకాలంలో పల్లె వాసులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. ఉధృతంగా ప్రవహిస్తున్న వరదకు జన జీవనం స్తంభించిపోతోంది. యేటా వానాకాలంలో పల్లె జనానికి వాగులు దాటే మార్గం లేక జల దిగ్బంధంలోనే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. మండలంలోని నక్కలపల్లి, బ్రహ్మణపల్లి, కొత్తపల్లి, రాజారం గ్రామాల శివార్లలోని లో లెవెల్ కల్వర్టులు, రోడ్ డ్యామ్‌లతో ప్రయాణికులతో తిప్పలు తప్పడం లేదు. భారీ వర్షాలకు వరద నీరు కల్వర్టులు, రోడ్ డ్యాం పై నుంచి పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. రవాణా సంబంధాలు తెగిపోతున్నాయి. వరద ఉధృతి తగ్గేంత వరకు ఆ గ్రామాల ప్రజలు పొరుగు గ్రామానికి వెళ్లలేని దుస్థితి దాపురిస్తుంది.

● వాగులు దాటేదెలా....?

మండలంలోని నక్కలపల్లి దారిలో లోత్రాై వరద నీరు కాజ్‌వే పై నుంచి ప్రవహించడంతో ఈ మార్గంలో ఒక్కోసారి గంటల కొద్ది ప్రయాణికులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే పారుపెల్లి పాత మార్గంలోని అక్కెపల్లి వాగు కాజ్‌వే పగిలిపోయి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో వాగు వరద వచ్చినప్పుడు కాజ్‌వే పై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో గుంతలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితుల్లో వాహనదారులు ఆ గుంతల్లో పడిన సందర్భాలున్నాయి.

మరో వైపు రాజారం, దేవులవాడ గ్రామాల మధ్య ఉన్న చిన్నవాగుపై వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోయింది. అలాగే బ్రహ్మణపల్లి సమీపంలోని గొర్రెగట్టు వాగుపై వంతెన లేకపోవడంతో వాగు అవతల నక్కలపల్లి, చామనపల్లి, బద్దెంపల్లి, బమ్మెన గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

మరో వైపు మల్లంపేట, నక్కలపల్లి గ్రామాల మధ్యలోని లోత్రాై ఉధృతితో రెండేళ్ల క్రితమేలో-లెవెల్ కాజ్‌వే కొట్టుకుపోయింది. ప్రతి సంవత్సరం మరమ్మ తులు చేస్తున్నా వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో ఇక్కడ వరద వచ్చినప్పుడు రాకపోకలు స్తంభించిపోయి అవతలి ఇవతలి ఒడ్ల వ ద్దనే ప్రయాణికులు గంటల కొద్ది నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వరద ఉధృతి తగ్గాక ప్రమాదకర పరిస్థితుల్లో వాగులు దాటుతున్నారు. మరోవైపు కొందరు వరదలో నుంచి ప్రయాణించేందుకు సాహసం చేస్తుండగా గతంలో పలువురు వరద ఉధృతికి కొంత దూరం కొట్టుకుపోయి ప్రాణాలతో బయట పడిన ఘటనలు ఉన్నాయి. వర్షాకాలంలో ఆ గ్రామాలకు వాగు దాటేదెలా అనే ఆందోళన ప్రజల్లో నెలకొంది.

● ప్రతిపాదనలకే పరిమితం...

మండలంలోని పలు గ్రామాల్లో వర్షాకాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు అధికారులు లోలెవెల్ కల్వర్టులు, రోడ్‌డ్యాం నిర్మాణ పనులకు ప్రతియేటా ప్రతిపాదనలు పంపినా నిధులకు మోక్షం లభించడం లేదు. తాత్కాలిక మరమ్మత్తులకు నిధులు మంజూరవుతున్నా ఈ నిధులతో మరమ్మత్తులు చేసినా వరద ఉధృతికి మరమ్మత్తులు ఆగడం లేదు. వంతెనల నిర్మాణ పనులపై దృష్టి సారించక పోవడం వల్ల వరద కష్టాలు వెంటాడుతున్నాయి. అలాగే పలు గ్రామాల్లోని లో లెవెల్ కల్వర్టులు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల తమకు వానాకాలంలో వాగులు దాటేందుకు అవస్థలు పడా ల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి మంత్రి పదవీ చేపట్టగా ఆయనపైనే గ్రామాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. తమ సమస్యలపై మంత్రి స్పందించి వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కాజ్‌వేలు కాకుండా వంతెనలు నిర్మిస్తేనే ప్రయాణ కష్టాలు తీరుతాయని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

దండేపల్లి జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్థాయికి అనుగుణంగా వారిలో ఆసక్తి పెంపొందించేలా పాఠాలు బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలను మంగళవారం ఆయన సందర్శించి పాఠశాలో జరిగే పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్కార్ బడుల్లో మెరుగైన విద్య నాణ్యమైన భోజనం అందిస్తోందన్నారు. కార్పోరేట్ స్థాయి తరహిలో సర్కార్ బడులను అనేక నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయిలో నిలవాలన్నారు.

దండేపల్లిలో దివంగత ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్దాంజలి ఘటించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత

దండేపల్లి జూలై 8(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలని జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత అన్నారు. మంగళవారం దండేపల్లి శ్రీలక్ష్మి మండల సమైఖ్య కార్యలయంలో ఇందిరా మహిళ శక్తి విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా మహిళ సంఘాలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. తీసుకున్న రుణాలను సంఘాల సభ్యులు సకాలంలో చెల్లించాలన్నారు. మండలంలోని కొత్త సంఘాలను ఏర్పాటు చేసి సభ్యులను గుర్తించి సంఘాలో చేర్పించాలన్నారు. శ్రీ స్త్రీనిధిలో భాగంగా గత ఎడాది సాధించిన ప్రగతిని వివరించి, ఎన్‌పిఎలు లేకుండా అన్ని గ్రామ సంఘాలు పూర్తిస్థాయిలో 100శాతం కట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సమైఖ్య కార్యదర్శి రజిత, కొశాధికారి నాగుబాయి, ఏపిఎం భూపతి బ్రహ్మయ్య, సీసీలు లావణ్య, తిరుపతిగౌడ్, అశోక్‌సురేందర్ పాల్గొన్నారు.

11న కార్మిక సంఘాలకు గుర్తుల కేటాయింపు

ఓరియంట్‌లో ఎన్నికల నిర్వహణపై అధికారుల కసరత్తు

కాసిపేట,జూలై8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న ఓరియంట్ సిమెంట్ కంపెనీలో పోటీ చేసే అన్ని గుర్తింపు సంఘాలకు ఎన్నికల గుర్తులను కేటాయిస్తున్నట్లు ఆదిలాబాద్ డీసీఎల్ రాజేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదాపడ్డాయి. కాని ఈసారి ఎలాగైన ఓరియంట్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కంపెనీలో 266 ఓటర్లు ఉండగా గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఐదు యూనియన్లు అర్హత సాధించాయి. ఎన్నికల నిర్వహణపై అధికారులు ఉత్తర్వులు అందజేశారు. రహస్య బాలెట్ పద్దతిన నిర్వహించే ఎన్నికలకు అందరు సహకరించాలని ఆమె కోరారు. అన్ని విధాలుగా బాగుంటే ఈ నెలాకరులోగ ఓరియంట్‌లో గుర్తింపు సంఘాల ఎన్నికలు జరుగనున్నాయి.

భూగర్భ జలాలు పెంపొందించేందుకే జలశక్తి అభియాన్

లక్షెట్టిపేట, జులై 8(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు పెంపొందించేందుక కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్ కార్యక్రమంలో చేపట్టిందని కేంద్ర జలశక్తి అభియాన్ సైటిస్టు రాంబాబు అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్, లక్ష్మిపూర్, జెండవెంకటా పూర్ గ్రామాల్లో ఆయన జాతీయ ఉపాధి హామీ పథకంలో భూగర్భ జలాభివృద్ధికి చేపట్టిన ఇంకుడు గుంతలను, చెరువులను, ఫిష్‌పాం ట్స్‌ని పరిశీలించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ నీటి నిలువలు పెంపొందించేలా పనులు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేసారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో సరోజ, ఈజీఎస్ ఏపివో వేణుగోపాల్, డీఆర్‌డీవో సిబ్బంది సత్యనారాయణ ఉన్నారు.

రూ. ఏడు కోట్లతో ఉడాయించిన వ్యాపారి

ఆగ్రహంతో వ్యాపారి ఇంటిపై దాడి

లక్షెట్టిపేట/దండేపల్లి జూలై 8(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేటకు చెందిన ఒక వ్యాపారి సు మారు 7కోట్ల రూపాయలకు ఐపీ పెట్టి ఉడాయించినట్లు తెలుస్తోంది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బాధితులు సదరు వ్యాపారి ఇంటి వద్దకు చేరి ఇంటిపై దాడికి పాల్పడ్డారు. బాధితుల్లో ఎక్కువ మంది రైతులు ఉన్నారు. రైతులను నమ్మించి వారి వద్ద ధాన్యం కొనుగోలు చేసి ఉడాయించినట్లు తెలుస్తోంది. మంగళవారం దండేపల్లి, లక్షెట్టిపేట మండలాలకు చెందిన సుమారు వంద మంది బాధితులు లక్షెట్టిపేట పట్టణంలోని బీట్ బజార్‌లో సదరు వ్యాపారి ఇంటిని చుట్టుముట్టారు. ఆగ్రహంతో పెట్టిన వ్యా పారి ఇంటిపై దాడి చేశారు. పోలీసులు వచ్చి ఆందోళన కారులకు నచ్చజెప్పడంతో బాధితులు శాంతించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మంచిర్యాలక్రైం, జూలై8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం చున్నంబట్టివాడకు చెందిన ఆసం కిషన్(36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కిషన్‌కు మహేశ్వరితో పెళ్లయింది. కిషన్ అతిగా మద్యం సేవించడం వల్ల భార్య అతడిని వదిలి వెళ్లిపోయింది. దీంతో కూలిపని చేసుకుంటున్న కిషన్ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి మద్యం సేవించి ఇంటిలో పడుకున్నాడు. తెల్లవారి చూసే సరికి స్పృహలేక ఉండడంతో తల్లి లక్ష్మీ, సోదరుడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కిషన్ అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అధ్యాపక పోస్టుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలక్రైం, జూలై8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు పద్ధతితో పీఈటీ, సీఆర్‌టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లాకు చెందిన అభ్యర్థులను రోస్టర్, మెరిట్ ఆధారంగా తీసుకుంటామ న్నారు. ఈ నెల 9న ఐడీవోసీ మంచిర్యాలలో ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరుకావాలన్నారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, పాఠశాలలో ఖాళీగా ఉన్న స్కావెంజర్ పోస్టుకు తాత్కాలిక మెరిట్ జాబితా ఐడీఓసీలో ఈనెల9 నుంచి 10వ తేదీ వరకు అప్పీల్ చేసుకోవాలని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

భీమిని, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తాండూర్ సీఐ కుమారస్వామి సూచిం చారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం పై విద్యార్థులు తమతమ తల్లిదండ్రులకు అవ గాహన కల్పించాలని, వాటి వినియోగం వల్ల కలిగే అనార్థాలను వారికి వివరించాలని సూచించారు. చెడు స్నేహితులతోనే చెడు అలవాట్లకు గురిఅవు తారని సూచించారు. తల్లిదం డ్రుల ఆశలను వమ్ము చేయకుండా లక్ష్య సాధ నకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయ్ కుమార్, ప్రత్యేకాధికారి శారద, కానిస్టేబుల్ లక్ష్మణ చారి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేజీబీవీలో మాట్లాడుతున్న సీఐ కుమార స్వామి

ఘనంగా వైఎస్సార్ జయంతి

బెల్లంపల్లి,జూలై8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళ వారం మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. వైఎస్ఆర్ చిత్రప టానికి పూల మాలలు వేసి మాట్లాడారు. ఈకార్యక్రమంలో నాయకులు ముచ్చర్ల మల్లయ్య, సూరిబాబు, గెల్ల జయరాం యాదవ్, సత్యానారాయణ, ఎండీ గౌస్, స్వామి పాల్గొన్నారు.

కాసిపేట: కాసిపేటలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆత్మచైర్మన్ రౌతు సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్, రాజమౌళి, సిరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని మంగళవారం పట్టణ కాంగ్రెస్ నాయకులు ఘనంగ నిర్వహించారు. కేక్‌కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, పట్టణ నాయకులు బత్తుల వేణు, గోపతి బానేష్, గోపు రాజం తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ముజాఫర్ అలీ, మండల కాంగ్రెస్ నాయకులు దుర్గం లక్ష్మీ నారాయణ, ఫసియుల్లా, మాణిక్యం, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద వైఎస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్‌ను కట్ చేశారు. పార్టీ నాయకులు సొత్కు సుదర్శన్, పైడిమల్ల నర్సింగ్, ఎన్. శ్రీనివాస్‌లు ఆలం శంకర్, గోగుల రాజయ్య, ఎర్ర రాజు, సొత్కు విజయ్‌కుమార్, షరీఫ్, రాచర్ల రవి, బీరం శ్రీనివాస్, రాకం సంతోష్, పోలు సంపత్, రంజిత్, వేణుగోపాల్‌చారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విగ్రహావిష్కరణ..

దండేపల్లి జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచు పురెళ్ల లక్ష్మణ్ జయంతి సందర్బంగా మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని కుటుం బసభ్యులు, గ్రామ పెద్దల చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బదిలీ

బెల్లంపల్లి, జూలై8 (ఆంధ్రజ్యోతి: బెల్లంపల్లి వన్‌టౌన్‌ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన దేవయ్య తాండూర్ సీఐగా మంగళవారం బదిలీ అయ్యారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు బదిలీపై వన్ టౌన్ ఎస్‌హెచ్‌వోగా బెల్లంపల్లికి రానున్నారు. మల్టీజోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్తమ గ్రామ సంఘాలకు సన్మానం

నెన్నెల, జులై 8 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ గ్రామ స్వయం సహాయక సం ఘాల నిర్వాహకులను నెన్నెల సెర్ప్ కార్యాల యంలో మంగళవారం ఘనంగా సన్మానిం చారు. ఇందిర మహిళా శక్తి సంబరాల్లో భాగంగా విజయవంతంగా యూనిట్లు నడుపుకుంటున్న వారిని సత్కరించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శపాఠశాలలు, స్కూల్ యూని ఫామ్స్ మేకింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూ నిట్లు, సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకుల నిర్వహణ గూర్చి చర్చించారు. ఈ నెల 16 వరకు గ్రామాల్లో ఇందిర మహిళా శక్తి సంబరాలు నిర్వహిస్తామని చెప్పారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిరూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో వచ్చే వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు రమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వర్షాలు పడుతున్నందు వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అధికారుల సంతాపం

మందమర్రిరూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా పాలకుర్తి మండల ఏంపీవో కమ్మగాని శ్రీనివాస్ ఈ నెల 7న మృతిచెందాడు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీవో రజియా సుల్తానా, ఈసీ మధు పాల్గొన్నారు.

సాదాబైనామాలపైనే ఆశలు..

(5వ పేజీ తరువాయి)

సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉప సంఘాన్ని కూడ వేసింది. అయినా సమస్యలకు పరిష్కారం లభించలేదు. ఆ సమస్య పరిష్కారం కాకుండానే 29అక్టోబర్ 2020లో కొత్త పట్టాదారు పాసుపుస్తకాల చట్టాన్ని తెచ్చింది. గత ప్రభుత్వం కేవలం జీవోల జారీతోనే సరిపెట్టిందని, సాదా బైనామాలపై తహసీల్దార్‌లకు అధికారాలు ఇచ్చినప్పటికీ వాటిని పరిష్కరించేందుకు సరైన మార్గదర్శకాలను విడుదల చేయలేదనే విమర్శలు ఉన్నాయి.

ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం ద్వారా రైతు సమస్యలను పరిష్కరించేందుకు దరఖాస్తులు స్వీకరించింది. దర ఖాస్తుల్లో అధిక భాగం సాదాబైనామాలకు చెందినవే ఉన్నాయి. వీటితో పాటు అసైన్డ్ భూముల కోసం కూడ దరఖాస్తులు వచ్చాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మేరకు సాదా బైనామాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా సాదా బైనామాల అంశం హైకోర్టులో ఉన్నందున ప్రభుత్వం కూడ ఎటు తేల్చుకోలేని స్థితిలో ఉంది. వాస్తవానికి ప్రభుత్వం భూభారతి చట్టంలో సాదా బైనామాల సమస్యను చేర్చినందున హైకోర్టు తీర్పు కూడ అనుకూలంగా వస్తుందనే అభిప్రా యాలు వ్యక్తమవుతున్నాయి. తీర్పు వెలువడిన తక్షణమే ప్రభుత్వం విధి విధానాలు రూపొందించి సమస్యలకు పరిష్కారం చూపాలనే విజ్ఞప్తులు ఉన్నాయి.

సమ్మెను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరు పాల్గొని విజ యవంతం చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేందుకు కుట్రలు చేస్తుందన్నారు. సమ్మెలో కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

●బుధవారం జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరు పాల్గొనాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాంశెట్టి నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల చట్టాలను లేకుండా చేయడానికి కుట్రలు చేస్తుందన్నారు.

లక్షెట్టిపేట: కార్మికుల హక్కులకై ఈనెల 9న సీఐటీయు ఆధ్వర్యంలో చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మెను విజవంతం చేయాలని సీఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు కూడా పాల్గొననున్నట్లు అందుకు సంభందించిన వినతిని సిబ్బందికి అందజేసారు.

రామకృష్ణాపూర్: ప్రభుత్వ రంగ సంస్థల రక్షణతోపాటు కార్మికుల హక్కుల కోసం నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయుసీ నాయకులు గనులు, డిపార్ట్‌మెం ట్లపై నిరసన కార్యక్రమాలు తెలిపారు.

జన్నారం: కార్మికులకు నష్టం కలిగించి 282 జీవోను రద్దు చేయాలని కోరుతూ సీపీఐఎం ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో కార్మికులకు నష్టం కలిగించే 282జీవో ప్రతులను దగ్ధం చేశారు.

హాజీపూర్: నేడు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి దుం పల రంజిత్ కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని ఎంఈవో కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందికి సమ్మె ఉద్దేశంపై వివరించి సమ్మెలో పాల్గొనాలని కోరారు.

నెన్నెల : దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం నెన్నెల మండల

రహదారికి మరమ్మతులు

చెన్నూరు : రోడ్డు భద్రతలో భాగంగా ప్రమాదాలను నివారించడానికి మంగళ వారం చెన్నూరు పోలీసులు రహదారికి మరమ్మతులు చేయించారు. పట్టణ సమీపం లోని జాతీయ రహదారి 63 బతుకమ్మ వాగు అప్రోచ్ రోడ్డు కోతకు గురి కావడంతో విషయం తెలుసుకున్న సీఐ దేవేందర్‌రావు ట్రాక్టర్‌లతో మట్టి పోయించి మరమ్మతులు చేయించారు. ప్రమాదాల నివారణకు రహ దారికి మరమ్మతులు చేయించామని సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



జీవో 49ని రద్దు చేయాలి

బెజ్జూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): టైగర్ కారిడార్ పేరిట తీసుకు వచ్చిన జీవో 49ను రద్దు చేయాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించడానికి ప్రభుత్వం జీవో 49ను తీసుకు వచ్చిందని చెప్పారు. వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు తిరుపతి, సకారాం, చిన్నన్న, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): టైగర్ కారిడార్ పేరుతో అడవుల నుంచి ఆదివాసీలను వెళ్లగొట్టే ప్రయత్నంలో తీసుకు వచ్చిన జీవో 49ను రద్దు చేయాలని గోండ్వానా సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సకారాం, రాజు, మల్లేష్, శ్రీనివాస్, భుజంగరావు, సర్దాజీ, చుక్కయ్య, మధునయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

సిర్పూర్(టి), జూలై 8 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలానికి చెందిన కొండగోని విఠల్‌గౌడ్‌ను అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందగా మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆధ్వర్యంలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ కింద రూ.2 లక్షల చెక్కును బీజేపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

- జిల్లాకు 7,154 కార్డులు మంజూరు
- 14 నుంచి పంపిణీ ప్రారంభం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాల లబ్ధికి రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో ఏళ్ల తరబడి దరఖాస్తు చేసుకుని వేచి ఉన్న వారికి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 14 వ తేదీ నుంచి లబ్ధిదారులకు రేషన్ కార్డు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



కొత్త రేషన్ కార్డులకు మోక్షం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఆహార భద్రత కల్పించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. ఎన్నో ఏళ్లుగా కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూసిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కొత్త కార్డుల మంజూరుతో పాటు పేర్లు చేరికలు, తొలగింపు ప్రక్రియకు అవకాశం కల్పించడంతో పేదల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రజాపాలన అరంభం నుంచి ఇప్పటి వరకు వివిధ దశ ల్లో ప్రభుత్వం దరకాస్తులు స్వీకరిస్తోంది. కార్డు లేకపోవడంతో చాలా కుటుంబాలకు రుణ మాఫీ వర్తించలేదు. కొత్తగా మంజూరైన వాటిని ఈనెల 14న పంపిణీకి అధికారులు కసర త్తు చేస్తున్నారు.

● సన్న బియ్యం పంపిణీతో..

చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తుండడంతో కార్డు పొందేందుకు ఆసక్తి పెరిగింది. ఇటు ప్రజాపాలన ఆటు మీసేవ కేంద్రాల ద్వారా కొత్త రేషన్‌కార్డుల మంజూరుతోపాటు మార్పులు, చేర్పులకు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులందాయి. వాటిని క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో పరిశీలించిన అధికారులు అర్హులకు అందించే ప్రక్రియను వేగవంతం చేశారు. జిల్లాకు కొత్తగా 7,154 కార్డులను అధికారులు మంజూరు చేశారు. ఈ కార్డుల పరిధిలో 22,206 మంది కుటుంబీకులు ఉన్నారు.

● ప్రభుత్వ పథకాల అమలుకు..

ప్రభుత్వ పథకాల అమలుకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటుండంతో కార్డు కోసం పేద కుటుంబాలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుతీరాక ప్రజాపాలన కార్యక్రమం ద్వారా మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. దీంతో పాటు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పౌరసరఫరాల శాఖ మీసేవ కేంద్రాల దరఖాస్తులకే తొలి ప్రాధాన్యం ఇస్తుంది. ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తు చేసుకున్న వారిలో మెజార్టీ సభ్యులు మీసేవ కేంద్రాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకున్నా రని అధికార వర్గాలు చెబుతున్నాయి. కార్డులు పంపిణీ నాటికి మరింత మంది దరఖాస్తులు ఆమోదం పొందు తాయని పాతకార్డుల్లోను సభ్యుల జోడింపు పెరగను న్నట్లు అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

● తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ..

రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగు తున్నారు. దీంతో జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాలు రద్దీగా మారాయి. రేషన్‌కార్డుల్లో కు టుంబ సభ్యుల పేర్లను జోడించడంతో పాటు మార్పులు, చేర్పుల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు అనంతరం వాటిని సంబంధిత సెక్షన్‌లో అందించేందుకు వెళుతున్నారు. దీంతో మీసేవ కేంద్రాలు కూడా దరఖాస్తు దారులతో రద్దీగా మారాయి.

మెరుగైన విద్య అందించాలి


భోజనం పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనిందించాలని ఐటీడీఏ పీవో ఖుషూగుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం పీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

వైఎస్సార్ ఆశయాల సాధనకు పాటుపడుతాం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధనకు పాటుపడుతామని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మురళీ, నిజాం, లచ్చన్న, వినోద్, విశ్వనాథ్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి వారు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, మాజీ సర్పంచ్ రాథోడ్ సవిత రాందాస్, సీనియర్ నాయకులు మేస్రాం అంబాజీరావ్, కోటేష్, ఆత్రం దత్తు, పంద్ర షేకు తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో మెనూ పాటించాలి

కెరమెరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అందించే భోజనంలో మెనూ పాటించా లని ఏటీడీవో శ్రీనివాస్ అన్నారు.హట్టి, బాజేఝరి, జోడేఘాట్ ఆశ్రమ పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు పంచపుల, జంగు ఉన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా అన్ని సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రీతి, కార్యదర్శి మహిపాల్, జిల్లా గురుకుల కో కన్వీనర్‌లలిత, మహేష్, అంజయ్య, శ్రీధర్, శ్వేత, పద్దమ, పుష్పలత పాల్గొన్నారు.

లెబర్ కోడ్‌లు రద్దు చేయాలి

రెబ్బెన, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ విధానాలను వెంటనే రద్దు చేయాలని వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు కోరారు. డిమాండ్ చేశారు. కైరిగూడ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు మాట్లాడారు. సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, కార్యదర్శి శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ సెక్రటరి సమ్మయ్య, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రసిడెంట్ పేరం శ్రీనివాస్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్లు ఆవిష్కరణ

కాగజ్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా అన్ని సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మె పోస్టర్లను మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో శంకర్, సంజీవ్, రవి, రమేష్, ఆశోక్, శ్రీనివాస్, లక్ష్మణ్, సత్యం పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం


కమిషనర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పురపాలక కమిషనర్ రాజేందర్‌ను మంగళవారం బాలభారతి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థి రాజేందర్ కాగజ్‌నగర్‌లోనే మున్సిపల్ కమిషనర్‌గా కావడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో బాలభారతి పాఠశాల కరస్పాండెంట్ వసీమోద్దీన్, బాలబారతి మేనేజింగ్ కమిటి వైస్ ఛైర్మన్ నాగేశ్వర్ రావు, ఈర్ల సునీల్ కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

బెజ్జూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కాగజ్‌నగర్ ఏటీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఆయన వెంట సలుగుపల్లి ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఎస్ఈఆర్పీ వెంకటేష్, ప్రధానోపాధ్యాయుడు భిక్షమయ్య తదితరులు ఉన్నారు.

గోయగాంలో పోచమ్మ బోనాలు


బోనాలతో ఆలయానికి చేరుకున్న మహిళలు

కెరమెరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాంలో మంగళవారం గ్రామస్థులు బోనాలు నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవత విగ్రహాలకు అభిషేకం, కుంకు మార్చన, పూర్ణాహుతి, విగ్రహ పునఃప్రతిష్టాపన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై దరఖాస్తులు అందజేయాలి


ఫిర్యాదుదారులకు రశీదు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో సోమవారం నిర్వహించే ప్రజవాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజల సౌకర్యార్థం ప్రతీ రోజు నిర్వహించనున్నామని, ప్రజలు సమస్యలపై దరఖాస్తులు అందజేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో గల జి-3లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కంట్రోల్ రూంను అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించడం కాకుండా నూతనంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో ప్రతి రోజు వివిధ సమస్యలపై ప్రజలు దరఖాస్తు అందజేయవచ్చని చెప్పారు. సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తులు సమర్పించిన వారికి రశీదులు అందజేస్తామని చెప్పారు.. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రీవెన్స్ సెల్‌లో రెండు దరఖాస్తులు రాగా వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత మండలాలకు పరిష్కారం కోసం పంపించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కిరణ్ పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు చర్యలు

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ఈవీఎంల భద్రతకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్ర పరిచిన స్ట్రాంగ్ రూంను మంగళవారం సాధారణ నెల వారి తనిఖీలో భాగంగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఈవీఎం గోదాం వద్ద పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతరంగా పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. 24 గంటలు సీసీ కెమెరాలు పని చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం గోదాంలోని అన్ని రిజిస్టర్లను, భద్రత ప్రమాణాలను సమీక్షించారు. కార్యక్రమంలో ఎన్నికల ఉప తహసీల్దార్ శ్యాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ఆదాయం

పెంచికలపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని ఉద్యానవన అధికారి సుప్రజ అన్నారు. గన్నారం, కమ్మర్‌గాం గ్రామాల్లో ఉద్యానవన శాఖ ద్వారా పెట్టిన ఆయి ల్‌పామ్ తోటను మంగళవారం సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ఉద్యానవన శాఖ 90 శాతం సబ్సిడీపై మొక్కలను అందిస్తుందన్నారు. నిర్వాహణ కోసం ఏడాదికి రూ.4.200 నాలుగేళ్ల పాటు అందజేస్తుం దన్నారు. అంతర పంటగా కూరగాయలు, పత్తి, పప్పు దినుసుల పంటలు సాగు చేసుకోవచ్చని సూచించారు.

దహెగాం (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని ఏఈవో వంశీ, మ్యాట్రిక్స్ ఎఫ్‌ఏ ధనుంజయ్ అన్నారు. మండలంలోని కమ్మర్‌పల్లి శివారులో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అధికారులు అనుమతి ఇవ్వాలి

సిర్పూర్(యు), జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుడ్‌పెల్లి పరిధిలో అటవీ ప్రాంతం మీదుగా విద్యుత్ స్తంభాలు వేసేందుకు అనుమతి ఇవ్వాలని పంగిడి మాజీ సర్పంచ్ ఆత్రం జాలీంషావ్ మంగళవారం జిల్లా అటవీ శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. వర్షాకాలంలో కరెంట్ కష్టాలతో ఇబ్బందులు పడుతున్నామని, చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రథమ చికిత్స అందించాలి

ఆసిఫాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని డీఎంహెచ్‌వో సీతారాం అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలకు ఎలాంటి చికిత్స చేయకూడదని సూచించారు.

ఆసరా పింఛన్లు బ్యాంకు ఖాతాల్లో వేయాలి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇచ్చే ఆసరా పింఛన్లు బ్యాంకు ఖాతాల్లో వేసేందుకు చర్యలు తీసుకోవాలని మంగళవారం జిల్లా కేంద్రంలో సదరం, పెన్షన్ ఇన్‌చార్జి శేషారావు జాదవ్‌కు పలువురు దివ్యాంగులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయాలి

వాంకిడి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో 18 ఏళ్లు నిండిన అర్హులను ఓటరు జాబితాలో పేరు నమోదు చేయాలని ఆర్డీవో లోకేశ్వర్ అన్నారు. రైతు వేదికలో మంగళవారం బూత్ స్థాయి అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

సిర్పూర్(టి), జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో వనమహోత్స వంలో భాగంగా మంగళవారం ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ తిరుపతి, ఇప్పతుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ విశ్వనాథ్, అధికారులు

జైనూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హరిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అన్నారు. మార్కెట్ కమిటీ యార్డు ఆవరణంలో మంగళవారం ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి సుమారు ఐదు వందల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆకు పచ్చ తెలంగాణ సాధన కోసం ప్రతి ఒక్క రూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ , సీనియర్ నాయకులు మేస్రాం అంబాజీ, నాయకులు రాథోడ్ రాందాస్ వసీం, ఆత్రం దత్తు, గేడాం గోపిచంద్, కోటేష్, పంద్ర షేకు, కనక గంగారాం, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోహన్, ఈవో కోరేంగ ఆనంద్‌రావ్, ఏపీవో నగేష్, టీఎలు రాజలింగు, సురెందర్‌రెడ్డి, ఆత్మరాం, ఎఫ్ఏ ఆత్రం రవిందర్ పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షించాలని డీఆర్‌డీఏ దత్తారావు అన్నారు. హట్టి ఆశ్రమ పాఠశాల ఆవరణలో మంగళవారం వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ 10 మొక్కలు నాటి వాటి సంరక్షణలో బాధ్యత చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 200 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, ఎంఈవో ప్రకాష్, ఏపీవో మల్లయ్య, ఏపీఎం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): చెట్లతోనే మానవ మనుగడ అని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాబాపూర్ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి నిరవధిక సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు ఒకే సంస్థలో ఒకే రకమైన రూల్స్‌తో పాటు అర్హులై ఉన్న వారికి కన్వర్షన్‌ను కోరుతూ ఈ నెల 14 నుంచి నిరవధిక సమ్మెను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మెకు సంబందించిన పోస్టర్లను మంగళవారం ఆసిఫాబాద్ విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో విడుదల చేశారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. కార్యయంలో సంఘం నాయకులు మారుతి, ఏకాంబరం, బుజ్జిబాబు, అశోక్, సలీమ్‌పాషా, శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీనివాస్, చంద్రయ్య, మారుతి, మోహన్, శీను, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీవో విచారణ

దహెగాం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం కోత్మీర్ గ్రామ పంచాయతీలో మంజూరై ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం డీఎల్‌పీవో అహ్మద్ ఉమర్ హుస్సేన్ విచారణ చేపట్టారు. ఇళ్లు మంజూరైన వారి వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విచారణకు సంబంధించి నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని డీఎల్‌పీవో తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి వంశీ తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

దహెగాం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం రాత్రి కుక్కలు దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన వెంకటేశం, తొడసం శంకర్, నారా లక్ష్మి అనే వ్యక్తులు సోమవారం రాత్రి నిద్రిస్తుండగా కుక్కలు దాడి చేసి గాయ పర్చాయి. బాధితులు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స తీసుకున్నారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇందిరా మహిళ శక్తి సంబరాలులో భాగంగా మంగళవారం స్థానిక ఐకేపీ వేంకటేశ్వరా మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ఆర్థిక, సామాజిక ప్రణాళికలను తయారు చేయాలన్నారు. రుణాలు తీసుకుని ఆర్థికంగా బలపడేగా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. అనంతరం వేంకటేశ్వరా మండల సమాఖ్య సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం మహేష్, ఈజీఎస్ ఏపీవో శ్రావణ్, ఎస్‌బీఎం సాయికృష్ణ పాల్గొన్నారు.


సంఘ సభ్యులను సన్మానిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్